క్లుప్తంగా

కాసిపేట-2 గనిపై కార్మికులకు పదోన్నతులు


పదోన్నతి పత్రాలు అందిస్తున్న గని మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై పదోన్నతులు పొందిన కార్మికులకు గురువారం గని మేనేజర్ రవీందర్ పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో 15మంది ఉద్యోగులకు టైం రేటెడ్ వేకేన్సీస్ ప్రమోషన్లు ఇచ్చినట్లు, కోల్‌కట్టర్–3, ట్రామర్–3, సపోర్ట్‌మెన్–5, లైన్‌మెన్–1, టబ్‌రిపేర్ మజ్దూర్–1, హామర్‌మెన్(రోప్)–1 ప్రమోషన్లు వచ్చినట్లు తెలిపారు. ప్రమోషన్‌లు పొందిన ఉద్యోగులు ఉత్పత్తి, ఉత్పాదకతలో నైపుణ్యం కనబరచి, గనికి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా 2021–22సంవత్సరానికి సంబంధించిన సీఎం పీఎఫ్ చీటీలను ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గోల్ల శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ రఘు, సంక్షేమాధికారి భార్గవ్ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంజనీపుత్ర ఎస్టేట్స్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న చైర్మన్ గుర్రాల శ్రీధర్

మంచిర్యాలటౌన్: ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో, సేవల్లో ఎప్పుడు అంజనీపుత్ర సంస్థ ముందుంటుందని ఆ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మంచిర్యాలలోని మేదరివాడ శ్రీ కోదండ రామాలయం, నస్పూర్, శ్రీరాంపూర్, కృష్ణాకాలనీ, మందమర్రి మండలంలో మామిడిగట్టు, వెంకటాపూర్ హనుమాన్ ఆలయాల్లో అంజనీపుత్ర ఎస్టేట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనేక సేవ కార్యక్రమాలు చేపడుతూ ప్రత్యేక గుర్తింపును అంజనీపుత్ర సంస్థ సొంతం చేసుకుంటుందని, ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో సైతం సంస్థ టీమ్ సభ్యులు సహకారం అందించారని, నిరుపేదలకు ఆర్థిక సాయం, ఆపదలో ఉన్న వారికి వెన్నుదన్నుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్స్, సేవా సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ, అంబలి పంపిణీ

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలోని శ్రీరామాలయం శివాలయం భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. తూముల భీమయ్య ట్రస్టు సహకారంతో గౌతమి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగను అందించారు. కార్యక్రమంలో వెంకట్రామయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, రాజన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. తెలంగాణ కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ మాట్లాడుతూ వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, భక్తులకు అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కుమ్మర సంఘం నాయకులు శాలిగంటి రమేష్, సిరికొండ సతీష్, ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి 12నెలల వేతనాలను ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపినందుకు గాను గురువారం జిల్లా కేంద్రంలో కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీఆర్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి బాపురావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కోశాధికారి రామ్‌సింగ్ పాల్గొన్నారు.

రాములోరి లగ్గం..!


చెన్నూర్ పంచముఖాంజనేయ ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు


దండేపల్లిలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు


గుడిపేట పునరావాస కాలనీలో కల్యాణంలో భక్తులు


సుద్దాలలో కల్యాణ మహోత్సవం


లక్సెట్టిపేట: హనుమాన్ ఆలయంలో...


శ్రీరాంపూర్‌లో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు


నెన్నెలలో పల్లకి ఊరేగిస్తున్న పోలీసులు


రామకృష్ణాపూర్: మాంగళ్యం చూపిస్తున్న పూజారి


తాండూర్: మాదారంలో పూజలు


బెల్లంపల్లి: రాములోరి పెళ్లికి హాజరైన భక్తజనం


నస్పూర్: విలేజ్ నస్పూర్‌లో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- రామనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఊరూరా శ్రీ సీతారామచంద్రుల కల్యాణం కనుల పండువగా జరిపారు. వేలాది మంది భక్తులు హాజరై జానకి రాముల కల్యాణ వేడుకలను భక్తి శ్రద్ధలతో తిలకించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టాడు. ఆ మనోహర దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు ఆసక్తిగా ఎదురు చూసి నయనానందం పొందారు. జై శ్రీరామ్.. జై శ్రీరామ్ అంటూ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, బెల్లం పానకం, పులిహోర, సిరా ప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణ వేడుకల అనంతరం మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. నెన్నెలలో పోలీసులు ఊరేగింపు ఉత్సవంలో పాల్గొని సీతారాముల పల్లకి మోశారు. దండేపల్లిలో హనుమాన్ దీక్షా స్వాములు బైక్‌ర్యాలీ నిర్వహించగా, రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను శోభాయాత్రగా ఊరేగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నస్పూర్ కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ, ఏఐటీయూసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, హాజరయ్యారు. నస్పూర్‌కాలనీ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవ రెడ్డి దంపతులు, జన్నారంలో ఎమ్మెల్యే రేఖానాయక్, కోటపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ దంపతులు, దండేపల్లిలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు,లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య పాల్గొనగా, ఆయా మండల కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


కాసిపేట: కల్యాణానికి హాజరైన భక్తులు


కోటపల్లి: పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దంపతులు


శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో...


జన్నారం: పొన్కల్ రామాలయంలో...


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జీఎం సంజీవరెడ్డి


భీమారం: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు


వేమనపల్లిలో...


జైపూర్: షెట్‌పల్లిలో సీతారాముల కల్యాణం


వేంపల్లిలో భక్తాంజనేయస్వామి ఆలయంలో...


నస్పూర్: విలేజ్ నస్పూర్‌లో పాల్గొన్న భక్తులు

ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ విడుదల

చెన్నూర్: పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపీనాథ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం తలపెట్టిన మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షులు మాసాని రమేశ్, కార్యదర్శి తగరం వెంకటేశ్, నాయకులు సాగర్, మహేశ్, పురుషోత్తం పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించే ‘చలో ఢిల్లీ’కి సంబంధించిన పోస్టర్లను గురువారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ, దేశ సంపదను కొందరు కార్పొరేట్లకు దోచి పెడుతున్నారన్నారు. ప్రభుత్వ వాటాలను అమ్మి పర్మినెంట్ ఉద్యోగులను ఇంటికి పంపుతున్నారన్నారు. మోడీ పాలనలో కార్మికులు, కర్షకులు బానిసలుగా మారుతున్నారని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ జరిగే ఈ ‘చలో ఢిల్లీ’ కార్యక్రమం విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గట్టు మహేందర్, సమ్మన్న, సంపత్, శ్రీనివాస్, తిరుపతి, సురేశ్, అశోక్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పడిపోతే గాని.. పట్టించుకోరా?



దండేపల్లి: మండలంలోని తానిమడుగు సమీపంలో పంట పొలాల్లో విద్యుత్ స్తంభం వంగి పడిపోయేలా ఉంది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి వంగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని, పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: రాయనర్సు, డిస్కం ఏఈఈ
ఫోన్ నంబర్ : 9440811718

ప్రోత్సహించి.. సన్మానించి



దండేపల్లి: మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సేంద్రియ సాగుతో పాటు, దేశీవంగడాలు, వివిధ రకాల పంటలు పండిస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తు, పలు అవార్డులు సొంతం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమెను జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గురువారం జరిగిన సలహాసంఘం సమావేశంలో సన్మానించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు సుధారాణి, పరిశోధన సంచాలకులు వెంకటరమణ, సహాయ సంచాలకులు జగన్మోహన్, వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా రోడ్డు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో ఏర్పాటు చేసిన వెంచర్‌కు మున్సిపాలిటీ రోడ్డు సాయిబాబఆలయం నుంచి ఉండగా, వెంచర్‌లోని ప్లాట్లను అధిక ధరకు అమ్ముకునేందుకు జాతీయ రహదారికే అనుమతి లేకుండా రోడ్డు వేశారు. పాతమంచిర్యాలలోని రాళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా నేషనల్ హైవే 63 వారు ఏర్పాటు చేసిన కాజ్‌బారియర్‌ను ఎవరి అనుమతులు తీసుకోకుండానే కట్ చేసి మరీ రోడ్డు వేసుకున్నారు. వెంచర్ నుంచి సుమారు 400మీటర్ల వరకు అనుమతులు తీసుకోకుండానే వేసిన రోడ్డుతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. వెంచర్ ఏర్పాటు సమయంలో రూపొందించిన లేఔట్‌లో ఉన్న రోడ్డుకు, ప్రస్తుతం వేసిన రోడ్డుకు సంబంధం లేదు. అయినా వెంచర్‌లోని ప్లాట్లకు డిమాండ్ వచ్చేందుకు గాను వెంచర్ యజమానులే సొంతంగా రోడ్డు వేయడం, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు నేషనల్ హైవే అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కాజ్‌బారియర్‌ను ఒకవైపు తొలగించి రోడ్డును వేశారు.


కాజ్ బారియర్‌ను తొలగించి, వేసిన రోడ్డు

చర్యలు తీసుకుంటాం

జాతీయ రహదారిని అనుకుని ఉన్న కాజ్ బారియర్‌ను తొలగించడం నేరం. ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారికి అనుసంధానంగా రోడ్డును వేయకూడదు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు మంత్రిత్వశాఖ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కాజ్ బారియర్‌ను తొలగించి, రోడ్డును వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– అన్నయ్య, నేషనల్ హైవే డీఈ